క్లుప్తంగా

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రామచంద్రపురంలో పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో మంగతాయారు

కె.కోటపాడు : గర్భిణులు, బాలింతలు అధిక పోషక విలువలను కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మంగతాయారు అన్నారు. మండలంలో రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పోషక విలువలు అధికంగా ఉండే ఆకుకూరలు, పప్పుదినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. తద్వారా రక్తహీనత సమస్య నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు



రిటైర్డ్ టీచర్ రాజేంద్రప్రసాద్ వర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, డిప్యూటీ కలెక్టర్ ప్రసాద్

దేవరాపల్లి : విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే వారికి పదవీ విరమణ అనంతరం కూడా సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ పదవీ విరమణ సన్మాన సభ హెచ్‌ఎం వై.స్వర్ణలత ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సన్మాన సభలో రిటైర్డ్ టీచర్‌ను ఎమ్మెల్సీ రఘు వర్మతో పాటు అనకాపల్లి జిల్లా డిప్యూటీ కలెక్టర్ జె.ఎస్.ఎస్. ప్రసాద్, స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ ఘనంగా సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.

తూటిపాలలో అనువాద దినోత్సవం

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచంలో ఉన్న భాషలను పాఠశాల హెచ్‌ఎం రాము విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలో అనేక భాషలు ఉన్నాయని, ఒక భాషలో ఉన్న సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్రలన్నీ ప్రజలకు తెలియాలంటే వారి భాషలోకి అనువదించాలన్నారు. ఒక భాష నుంచి మరొక భాషకు అనువదించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సునీల్‌కుమార్

నర్సీపట్నం : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సునీల్‌కుమార్‌ని నియమిస్తూ ప్రొహిబిషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన సెబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం సెబ్ రద్దు చేసి, ఎక్సైజ్‌లో విలీనం చేసింది. దీంతో తిరిగి ఆయనను సీఐగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

క్రీడలతో ఎన్నో ఉపాధి అవకాశాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చోడవరం సీఐ అప్పలరాజు

చోడవరం రూరల్ : క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయిని చోడవరం సీఐ అప్పలరాజు అన్నారు. స్థానిక గవర్నమెంటు జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి గేమ్స్ మీట్ సందర్భంగా సోమవారం క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడల జట్లు ఎంపిక కోసం విశ్రాంత ఉపాధ్యాయులు గొతిరెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో గేమ్స్ ప్రారంభించారు. ఈ ఎంపికలో బాలబాలికలకు కలిపి సుమారు 20 కళాశాలల జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా!

- తాండవ కాలువలపై శిథిలమైన కల్వర్టులు
- రెండు జిల్లాల పరిధిలో 85పైగా వంతెనలు, కల్వర్టులు
- వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రధాన మార్గాలు



జిల్లేడుపూడి రోడ్డులో తాండవ కాలువపై నిర్మించిన వంతెనకు ఏర్పాటు చేసిన కర్రలు



గోవిందపురం వెంకయ్యపాలెం రోడ్డులో తాండవ కాలువపై శిథిలమైన కల్వర్టు గోడలు

నాతవరం : ఆయకట్టు భూములకు సాగునీరు అందించే తాండవ కాలువలపై రాకపోకలకు వీలుగా నిర్మించిన వంతెనలు, కల్వర్టులు పూర్తిగా శిథిలం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాండవ రిజర్వాయరులో నీటిని ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించడానికి అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో పెద్దా చిన్న పంట కాలువలు మొత్తం 120 కిలోమీటర్లు పొడవునా ఏర్పాటు చేశారు. నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం, కోటనందూరు, తుని, రవతలపూడి మండలాల పరిధిలో గ్రామాల మధ్యలోంచి తాండవ కాలువలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు కాలువలపై తాండవ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు ఇతర రోడ్లపై సుమారుగా 85పైగా వంతెనలు, కల్వర్టులు నిర్మించారు. అవి క్రమేపీ మరమ్మతులకు గురై వంతెనలు, కల్వర్టులపై రక్షణ గోడలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో వాటిపై రాకపోకలు సాగించేవారు తరచూ ప్రమాదాలకు గురౌవుతున్నారు. మారుమూల గ్రామాల ప్రజలు తాండవ కాలువలపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులపైనే ప్రధానంగా రాకపోకలు సాగిస్తుంటారు. రక్షణ గోడలు శిథిలం కావడంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో వచ్చే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నాతవరం మండలం, జిల్లేడుపూడి గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై తాండవ కాలువపై నిర్మించిన వంతెన శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఇక్కడ స్థానికులు తాత్కాలికంగా కర్రలు ఏర్పాటు చేశారు. గాంధీనగరం, ఎంబీపట్నం, ఎ.శరభవరం, నాయుడుపాలెం, నాతవరం, చమ్మచింత, గుమ్మడిగొండ, గునుపూడి పి.కె.గూడెం, శృంగవరం, పెద జగ్గంపేట, గన్నవరం, వై.బి.పట్నం గ్రామాల వద్ద తాండవ కాలువలపైనా వంతెనలు శిథిలం అయ్యాయి. నర్సీపట్నం మండలం వేములపూడి, దుగ్గాడ, మెట్టపాలెం, మెండికండి, అమలాపురం, కోటవురట్ల మండలంలో పాములవాక, యరకన్నపాలెం, రామన్నపాలెం, కొత్తపల్లి జంగాలపాలెం, బోడపాలెం గ్రామాల పరిధిలో తాండవ కాలువలు ఉన్నాయి. కోటనందూరు మండలం అల్లిపూడి ఎస్.ఆర్.పేట లక్ష్మీపురం తదితర గ్రామాల్లో కాలువలపై వంతెనలు శిథిలమై ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయ ఉత్పత్తులు తరలించాలన్నా, గ్రామస్తులు రాకపోకలు సాగించాలన్నా తాండవ కాలువపై నిర్మించిన వంతెనలే ఆధారం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వంతెనలు, కల్వర్టులు, మరింత శిథిలం అయ్యాయి. కాలువలో నిండుగా నీరు ప్రవహించడంతో శిథిలమైన వంతెనలు, కల్వర్టులపై భయం భయంగా జనం రాకపోకలు సాగిస్తున్నారు.

మరో మార్గం లేదు..



మా గ్రామానికి రాకపోకలు సాగించాలంటే తాండవ కాలువపై జిల్లేడుపూడి వద్ద నిర్మించిన వంతెనపై ప్రయాణించాలి. మా పంచాయతీ శివారు గ్రామాలైన సీతారాంపురం, లక్ష్మీపురం పార్వతీపురం గ్రామస్తులు ఆ వంతెనపై నుంచి రాకపోకలు సాగించాలి. శిథిలమైన వంతెనలపై ప్రయాణించేటప్పుడు భయంగా ఉంటుంది. మా పంచాయతీకి మరో మార్గం లేదు. ఈ సమస్యను అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– పైల శిరీష, సర్పంచ్, చెర్లోపాలెం పంచాయతీ

తరుచూ ప్రమాదాలు



శిథిలమైన వంతెనలు, కల్వర్టులపై రాకపోకలు సాగించేటప్పుడు పలు మార్లు ప్రమాదాలు జరిగాయి. వంతెనలు, కల్వర్టులపై రక్షణ గోడలు పూర్తిగా ధ్వంసం కావడంతో కొత్తగా వచ్చే వారు ఏమాత్రం ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసినా ప్రవహించే తాండవ కాలువలోకి పోతారు. మా పంచాయతీలో గోవిందపురం, వెంకయ్యపాలెం మధ్య తాండవ కాలువపై నిర్మించిన కల్వర్టు వద్ద అనేకసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

–లాలం లోవ, జిల్లేడుపూడి గ్రామం

నిధులకు ప్రతిపాదనలు



తాండవ రిజర్వాయరు పరిధిలో ప్రమాదకరంగా ఉన్న వంతెనలు, కల్వర్టులు మరమ్మతులు చేసేందుకు మొదట విడతలో రూ.2.40 కోట్లకు ప్రతిపాదనలు చేశాం. ఆ నిధులు వచ్చాక పనులు చేస్తాం. వంతెనలు, కల్వర్టులు తాండవ కాలువల ఏర్పాటు సమయంలో నిర్మించారు. వాటితో పాటు తాండవ కాలువలపై నిర్మించిన అక్విడెక్టులు సైతం పూర్తిగా శిథిలం అయ్యాయి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం.

–స్వామినాయుడు, ఇరిగేషన్‌శాఖ ఈఈ

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

రోలుగుంట : మండలంలో గ్రామగ్రామాన ఈ నెల 3 తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఘన ఏర్పాట్లు చేశారు. పలు గ్రామాల్లో భక్తులు ప్రతి ఏడాది మాదిరి గానే భవానీ మాలలు ధరించారు. రోలుగుంట పాత రామమందిరం వద్ద గల కల్యాణ మండపం వద్ద సువిశాల ప్రదేశంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 3న అమ్మవారిని వాహనంపై గ్రామ ప్రదక్షణ, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి, 7న హోమం, భారీ అన్నసమారాధన, 9న సరస్వతి పూజ, మూల పూజలు నిర్వహిస్తారు. 10న దుర్గాష్టమి నాడు కుంకుమ పూజ, 12న విజయదశమి నాడు శమీపూజ, అదేరోజు రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో పలు శక్తి నృత్యాలు, అమ్మవారి గీతాలతో భక్తుల దర్శనార్థం ఊరేగించడం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు

ఐదు నుంచి 15 సంవత్సరాల్లోపు విద్యార్థులకు నర్సీపట్నం డివిజన్ స్థాయిలో పెదబొడ్డేపల్లి శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం ఆవరణలో విజయదశమి సందర్భంగా ఈ నెల 3 నుంచి 12 తేదీ వరకూ పలు పోటీలు నిర్వహించనున్నట్టు శ్రీ జ్ఞాన సరస్వతి సేవా ట్రస్ట్ నిర్వాహకుడు బాబూరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 న విజయదశమి ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు, 4న దసరా పండగపై వ్యాసరచన, 5న వేమన పద్య పఠనం, 6న ముగ్గుల పోటీలు, 7న దేవతల చిత్రలేఖన పోటీలు, 8న కోలాటం, 9న లలితా సహస్ర నామాల పఠనం, 10న చండీ హోమం, 11న భరతనాట్యం, 12న శమీపూజ, విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆలయం వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చిరుధాన్యాలతో పౌష్టికాహారం



ఎం.కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న మాడుగుల సీడీపీవో శ్రీదేవి

మాడుగుల రూరల్ : చిరుధాన్యాలతో కూడిన రాగులు, గంటెలు, ఉలవలు, కొర్రలు, ఆకుకూరలతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చని మాడుగుల సీడీపీవో సిహెచ్.శ్రీదేవి పేర్కొన్నారు. పోషకాహార వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎం. కోడూరు 1వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మునగాకు, గోంగూర, పాలకూర, బచ్చలి మొదలైన ఆకు కూరలు, స్థానికంగా లభ్యమయ్యే కూరగాయలు, ఆయా కాలాల్లో దొరికే పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎం.కె.వల్లాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు సోమవారంతో ముగిసాయి. గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాలు వయస్సులోపు పిల్లలకు కిశోర బాలికలకు చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందించాలని సూపర్‌వైజర్ ఏలుసూరి ఈశ్వరమ్మ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎలుగెత్తి చాటారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి బయలుదేరిన ప్రదర్శనను ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. స్వచ్ఛభారత్-ఆరోగ్య భారత్, ప్లాస్టిక్ నిషేధిద్దాం-కాటన్ సంచులు వాడుదాం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పలువురి ఆరోగ్యాన్ని కాపాడుదాం అంటూ నినాదాలతో పాటు ప్లకార్డులను ప్రదర్శించారు. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు వి.మల్లిబాబు, రాధాకృష్ణ, సూర్యావతి, ఫిజికల్ డైరెక్టర్ మూర్తి పాల్గొన్నారు. అలాగే కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయం, టీటీడీ కల్యాణ మండపం పరిసరాల్లో సోమవారం పరిసరాలు పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బి.చంద్రశేఖర్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, ప్రమాదాల్లో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చెత్తంతా శారదానదిలోకి...



దేవరాపల్లిలో శారదానది నీటిలోకి చెత్త కుప్పలను తోసేస్తున్న పొక్లెయిన్

దేవరాపల్లి : మండల కేంద్రంలో శారదానది ఒడ్డున వేసిన భారీ చెత్త కుప్పలను శారదానది నీటిలోకి తోసేసిన దారుణ పరిస్థితి సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలో సేకరించిన చెత్తాచెదారాలను శారదానది ఒడ్డున కుప్పలుగా వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త తడిసి మురుగు కూపంగా మారింది. దీంతో గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి విదితమే. ఉన్నతాధికారులు స్పందించి చెత్త కుప్పలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గ్రామానికి దూరంగా చెత్త కుప్పలను తరలించాల్సిన పంచాయతీ అధికారులు చెత్తను పొక్లెయిన్‌తో శారదానదిలోకి తోసేసి చేతులు దులుపు కోవడం వివాదాస్పదమైంది. తాజాగా రైవాడ జలాశయం గేట్లు ఎత్తి శారదానదిలోకి నీటిని విడుదల చేయడంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ సమయంలో చెత్త కుప్పలు శారదానదిలో విడిచి పెట్టడంపై పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని పంట పొలాలతో పాటు పాడి పశువులు, ఇతర మూగ జీవాల తాగునీటికి సైతం వినియోగిస్తారు. దీంతో నది నీరు కలుషితం చేయడం పట్ల పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి-పినకోట తారు రోడ్డుకు ఆనుకొని ఇలా చెత్తను నదిలోకి నెట్టివేయడం జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంక్వైరీ పేరుతో ఇసుక పంపిణీ నిలిపివేత దారుణం



కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల వాగ్వాదం

నర్సీపట్నం : ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ చేయకుండా ఎంక్వయిరీ పేరుతో నిర్మాణదారులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర టీడీపీ కౌన్సిలర్లను నిలదీశారు. ఎంక్వయిరీ చేయండి..కానీ ఇసుకను పంపిణీ చేయండని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అదేశాల మేరకు శానిటేషన్ నిర్వహణకు అవసరమైన వాహనాలు కొనుగోలుకు జనరల్ ఫండ్ నుంచి రూ.1.5 కోట్లు కేటాయించినట్లు ఎజెండాలోని పేర్కొనడంపై వైస్ చైర్మన్ రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ఎందుకు ఈ పని చేయలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును నిలదీశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ టీడీపీకి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి వాహనాలకు ప్రత్యేక గ్రాంటు తీసుకువస్తే హర్షించేవారమని, ప్రజల సొమ్ము స్పీకర్ ఇచ్చినట్టు ఎజెండాలో పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ ఆదేశిస్తేనే నిధులు కేటాయించారని టీడీపీ కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, శ్రీకాంత్ పేర్కొనడంతో వైస్ చైర్మన్, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ చెబితే నిధులు కేటాయించారా..? పాలకవర్గం చెబితే నిధులు కేటాయించరా? అని వైస్ చైర్మన్ రామకృష్ణ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. జనరల్ ఫండ్ నిధులకు రాజకీయరంగు పులమవద్దని చైర్‌పర్సన్ టీడీపీ కౌన్సిలర్లకు సూచించారు. సామూహిక మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించడంపై వైస్ చైర్మన్ అప్పలనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు.

సేంద్రియ ఎరువును రైతులు వినియోగించుకోవాలి



వానపాములను విడుదల చెస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

చీడికాడ : సేంద్రియ ఎరువును రైతులు వినియోగించుకుంటే అటు నేలకు ఇటు రైతుకు మేలు జరుగుతుందని జైతవరం సర్పంచ్ కోడూరి సత్యవతి అన్నారు. సోమవారం గ్రామంలోని చెత్తనుంచి సంపద కేంద్రంలో వానపాములను విడుదల చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడిచెత్త సేకరించి వానపాముల ద్వారా తయారయ్యే ఎరువు చాలా మంచిదన్నారు.

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోరింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు రాజు డిమాండ్ చేశారు. డిమాండ్స్ డేను పురస్కరించుకుని మున్సిపల్ ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పర్మనెంట్ ఉద్యోగులకు ఇచ్చే వేతనంతో పోలిస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 70 శాతం వ్యత్యాసం ఉందన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో లోవరాజు, అర్జమ్మ, కుమార్, దుర్గా పాల్గొన్నారు.

నేడు నల్లగొండమ్మ పండగ మహోత్సవం



డి.యర్రవరంలో అమ్మవారు

నాతవరం : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లగొండమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నాతవరం, గొలుగొండ, కొయ్యూరు మండలాల సరిహద్దులో ఉన్న నల్లగొండమ్మతల్లిపై ఈ ప్రాంత ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉంది. తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు భూములకు నీటిని విడుదల చేసే ముందు అమ్మవారికి పూజలు చేసి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది కూడా ఘనంగా పండగ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం పండగ రోజు నర్సీపట్నం ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. డి.యర్రవరంలో వెలసిన నల్లగొండమ్మ తల్లి పండగను మంగళవారం జరుపుకోవడానికి ప్రత్యేక ఏర్పా ట్లు చేశారు. ఇక్కడ మొదట్లో వేపచెట్ల వద్ద అమ్మవారి పండగ జరిపేవారు. ఇదే గ్రామానికి చెందిన చింతంరెడ్డి బెన్నయ్యనాయుడు పదేళ్ల క్రితం తన సొంత భూమిలో ఆలయం నిర్మించగా, అప్పట్నుంచి ఇక్కడ పండగను మరింత ఘనంగా నిర్వహిస్తున్నారు. పండగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నాతవరంలో నూతనంగా నిర్మించిన నల్లగొండమ్మ తల్లి ఆలయం వద్ద పండగను మంగళవారం జరుపుకోనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆలయం నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ



ఎ.కొత్తపల్లి విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, సర్పంచ్ చింతల రమణ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయప్రకాష్



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విజేతలపై విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లిలో హైస్కూల్ విద్యార్థులు చొడువాడలో ఈ నెల 27, 28 తేదీలలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. అండర్-17 కబడ్డీలో బాలికలు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్టు హెచ్‌ఎం వై. స్వర్ణలత తెలిపారు. ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ, ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, హెచ్‌ఎం వై.స్వర్ణలత విద్యార్థులను, పీడీ సూర్యప్రకాష్‌రావును అభినందించారు. తెనుగుపూడిలోని డా.బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయ విద్యార్థులు కూడా క్రీడా పోటీల్లో సత్తా చాటారు. అండర్-14, అండర్-17 విభాగాలలో ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్‌లో గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-17లో 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో ఎస్.గౌరీ మణి శంకర్, లాంగ్ జంప్‌లో ఎన్.సాయి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్‌లో జి.జగదీష్, 200 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్, ఆర్.తరుణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. డి. ప్రశాంత్ 400 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. ఆయా విద్యార్థులు, పీఈటీలు తరుణేశ్వరరావు, నాగేశ్వరరావులను గురుకుల ప్రిన్సిపాల్ జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ రఘు, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహమూర్తి, కమిటీ సభ్యురాలు సంతోషి అభినందించారు.

మాకవరపాలెం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మండల, నియోజకవర్గస్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. జిల్లాస్థాయిలో పోటీలకు కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో జి.రాజేష్, రన్నింగ్ కృపా భగవాన్, చదరంగంలో స్టీఫెన్, షటిల్ అండర్-14 బాలురు నుంచి తరుణ్, ఖోఖో బాలికల విభాగం నుంచి భవ్యప్రసన్న, హేమ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం అచ్యుత రామయ్య తెలిపారు.

చీడికాడ: నియోజకవర్గ స్థాయి క్రీడల్లో అండర్-14,17 విభాగాల్లో మండలంలోని వరహాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో అండర్-14 100మీ, 200 మీటర్లు రన్నింగ్, లాంగ్‌జంప్ బాలికల విభాగంలో ధర్మిశెట్టి వసంత ప్రథమస్థానంలో, కరణం జ్యోతి 600 మీటర్ల విభాగంలో ప్రథమస్థానంలో నిలవగా, 400 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17లో 3000 మీటర్లలో జి.వసంత ప్రథమ స్థానంలో వి.కృష్ణవేణి 400 మీటర్లలో మొదటి స్థానంలో నిలవగా, అండర్-17 బాలురు 3000 మీటర్లు విభాగంలో డి.లోవర్ధన్ మొదటి స్థానంలో, 800 మీటర్లు రన్నింగ్ విభాగంలో ఎస్.నీలవర్ధన్ రెండోస్థానంలో , ట్రిపుల్ జంపులో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం వరహామూర్తి, పీడీ సింహచలం, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి అభినందించారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన గాంధీగ్రామం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చోడవరం రూరల్ : జిల్లా స్థాయిలో జరగనున్న ఆటల పోటీలకు గాంధీగ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 15 మంది, 34 ఈవెంట్లకు ఎంపికై తమ సత్తా చాటారు. నియోజకవర్గ స్థాయిలో శనివారం రావికమతం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పలు పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పాండురంగారావు తెలిపారు. చెస్ పోటీలో రిత్విక్, బ్యాడ్మింటన్‌లో వంశీకృష్ణ సాయిరాం షణ్ముఖశ్రీ, వాలీబాల్‌లో అరుణ్‌కుమార్, ఇష్వాక్, ఖో-ఖోలో చరణ్, .దరణికాంత్, వినయ్ యశ్వంత్‌లు ఎంపికయ్యారు. యోగాలో ధనుష్, రవితేజ, గౌతమ్‌కుమార్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పోటీకి అరుణ్‌కుమార్, 400 మీటర్ల పరుగునకు అరుణ్‌కుమార్‌తోపాటు నవీన్ రాజ్, వినయ్, 600 మీటర్ల విభాగంలో చరణ్, 800 మీటర్ల పరుగునకు సంపత్, 1500 మీటర్ల పోటీకి సంపత్‌కుమార్, లాంగ్ జంప్‌నకు చరణ్, దుర్గాప్రసాద్, హైజంప్‌లో అరుణ్‌కుమార్, వినయ్, హేమర్ త్రోలో ధరణి కాంత్, డిస్కత్రోలో వినయ్, ధరణి ఎంపికయ్యారు. షాట్‌పుట్‌లో రాజు, వినయ్, ఇష్వాక్,, జావెలిన్ త్రోలో ధరణికాంత్, 500 మీటర్ల నడక పోటీకి గౌతంకుమార్ ప్రతిభ చూపి జిల్లా పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. పాఠశాల నుంచి 34 ఈవెంట్లలో పాల్గొనడానికి విద్యార్థులు అర్హత సాధించడం విశేషమని హెచ్‌ఎం అన్నారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను హెచ్‌ఎంతోపాటు సహ ఉపాధ్యాయులు అభినందించి, జిల్లా స్థాయిలోను పాఠశాలకు పేరు తేవాలని కోరారు.

నేడు దిబ్బిడిలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు

బుచ్చెయ్యపేట : దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం రగ్బీ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి బాల,బాలికల అండర్ 14, అండర్ 17 రగ్బీ ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.